# అక్షరశక్తి

The Power of Pen

Evening Daily

సంపుటి: 20 | సంచిక: 282 | వరంగల్ | గురువారం, 13 ఆగస్టు 2026 | పేజీలు: 7





అక్షరశక్తి, ములుగు: మేడారం వేదికగా మరో కీలక కార్యక్రమానికి ములుగు సిద్ధమవుతోంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెల 16న ములుగు జిల్లాలో పర్యటించనుండటంతో అధికారులు ఏర్పాట్లను పరుగులు పెట్టిస్తున్నారు. వనదేవతల సన్నిధిలో సీఎం ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు.. అక్కడి నుంచే ఒంటరి, వితంతు మహిళల పింఛన్ల పంపిణీకి శ్రీకారం చుట్టనుండం మేడారం ప్రత్యేక ప్రాధాన్యం సంతరించుకుంది. సీఎం పర్యటనకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా మేడారం నుంచి నూతన కలెక్టరేట్ వరకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. పైలాన్ నిర్మాణం తుది దశకు చేరుకోవడంతో కొత్త అందాలను సంతరించుకుంది. నూతన కలెక్టరేట్ భవన సముదాయం సైతం ముఖ్యమంత్రి పర్యటనకు సిద్ధమవుతోంది. ఏర్పాట్లను గురువారం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క గురువారం పరిశీలించారు. కలెక్టర్ బోర్ధడే హేమంత్ సహదేవరావు, ఎస్పీ సుధీర్ రామ్ నాథ్ కేకన్, ఐటీడీఏ పీవో లెనిన్ వస్సల్ టోప్పోతో కలిసి మేడారం, పైలాన్, కలెక్టరేట్ ప్రాంతాల్లో జరుగుతున్న పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.

# ములుగు ముస్తాబు!





## తల్లుల చెంత నుంచే మహిళలకు 'పింఛన్'

- సీఎం రాకకు వనదేవతల సన్నిధి సిద్ధం
- హంగులంద్దుకున్న కలెక్టరేట్..
- కనువిందు చేస్తున్న పైలాన్..
- ముఖ్యమంత్రి పర్యటనకు చకచకా ఏర్పాట్లు..
- పరిశీలించిన మంత్రి సీతక్క
- గడువులోపు పనులు పూర్తి చేయాలని ఆదేశం

4

# అక్షర శక్తి కథనానికి స్పందన

## సౌమ్యకు అండగా నిలిచిన యువ నేత విష్ణువర్ధన్ రెడ్డి




అక్షర శక్తిలో ప్రచురితమైన కథనానికి స్పందించిన యువ నేత విష్ణువర్ధన్ రెడ్డి గురువారం పబ్లిక్ గార్డెన్‌లో సౌమ్య నిర్వహిస్తున్న దుకాణాన్ని సందర్శించారు. ఆత్మవిశ్వాసం చివరి అంచు అనే మానవీయ కథనానికి విష్ణు స్పందించారు.

*- అక్షరశక్తి, హనుమకొండ*

4



అక్షరశక్తి | 8 | సోమవారం, 10 ఆగస్టు 2026 | Telugu Trending News

ఆత్మవిశ్వాసం
చివరి అంచు!




# ఘనంగా 'హర్ ఘర్ తిరంగా' ర్యాలీ

'హర్ ఘర్ తిరంగా' అభియాన్‌లో భాగంగా గురువారం సాయంత్రం బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ తిరంగా ర్యాలీ నిర్వహించారు. వేయిస్తంభాల గుడి నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు సాగిన ఈ ర్యాలీలో టీచర్స్ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులు, యువత, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ముువ్వన్నెల జెండాలను చేతబూని దేశభక్తి నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. *- అక్షరశక్తి,హనుమకొండ*

5

# విద్యార్థులే ఓటర్లు.. విద్యార్థులే ఎన్నికల అధికారులు








**అక్షరశక్తి,హన్మకొండ:** నక్కలగుట్టలోని ఎస్సార్ ఫోకస్ పాఠశాలలో గురువారం విద్యార్థులకు ఎన్నికల ప్రక్రియపై ప్రత్యక్ష అవగాహన కల్పించేందుకు పాఠశాల స్థాయి ఎన్నికలు నిర్వహించారు. సుమారు 160 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్న ఈ ఎన్నికలను ప్రిన్సిపల్ మనోజ్ ఆధ్వర్యంలో అధ్యాపక బృందం పకడ్బందీగా నిర్వహించింది. స్కూల్ పీపుల్ లీడర్ (ఎస్పీఎల్), డిప్యూటీ స్కూల్ పీపుల్ లీడర్ (డీఎస్పీఎల్) పదవులకు పోటీ చేసిన విద్యార్థులు తాము ఎన్నికైతే చేపట్టే కార్యక్రమాలను వివరించగా, అనంతరం అర్హత పరీక్ష ద్వారా అభ్యర్థులను ఎంపిక చేశారు. నిజమైన ఎన్నికలను తలపించేలా విద్యార్థుల గుర్తింపు కార్డులను పరిశీలించి, చేతికి సిరా గుర్తు వేసి బ్యాలెట్ పత్రాలు అందజేసి ఓటింగ్ నిర్వహించారు. ఈ ఎన్నికల్లో విద్యార్థులనే ఎన్నికల అధికారులుగా నియమించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పోలింగ్ కేంద్రాల నిర్వహణ, ఓటర్ల పరిశీలన, బ్యాలెట్ పత్రాల పంపిణీ తదితర బాధ్యతలను విద్యార్థులే నిర్వర్తించారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించడంతోపాటు ప్రజాస్వామ్య వ్యవస్థ, ఎన్నికల విధానం, ఓటు విలువపై అవగాహన కల్పించడమే కార్యక్రమం ఉద్దేశమని ప్రిన్సిపల్ మనోజ్ తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ నిర్వహించగా, భోజన విరామం అనంతరం ఓట్ల లెక్కింపు చేపట్టి ఎస్పీఎల్, డీఎస్పీఎల్‌గా ఎన్నికైన వారి పేర్లను ప్రకటించనున్నట్లు పాఠశాల యాజమాన్యం తెలిపింది.

# అవయవ దానం మహాదానం

**అక్షరశక్తి,వరంగల్:** జాతీయ అవయవ దాన దినోత్సవం సందర్భంగా వరంగల్ తూర్పు నియోజకవర్గం 39వ డివిజన్‌కు చెందిన ఇల్లందుల వెంకటేశ్వర్లు తన మరణానంతరం దేహాన్ని కాకతీయ మెడికల్ కాలేజీకి అందజేసేందుకు నిర్ణయించుకోవడం అభినందనీయమని బీజేపీ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్, రాష్ట్ర నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్ రావు అన్నారు. వరంగల్ జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షులు మాదాసు రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వెంకటేశ్వర్లును శాలువాతో ఘనంగా సత్కరించి అభినందించారు. ఆయన తీసుకున్న నిర్ణయం సమాజానికి ఆదర్శంగా నిలుస్తుందని కొనియాడారు. ఈ సందర్భంగా గంట రవికుమార్, ఎర్రబెల్లి ప్రదీప్ రావు మాట్లాడుతూ మరణానంతరం మరొకరికి జీవం పోసే అవయవ దానం, వైద్య విద్యార్థుల పరిశోధనలకు ఉపయోగపడే దేహదానం అత్యంత పవిత్రమైనవని అన్నారు. వెంకటేశ్వర్లు నిర్ణయం ఎంతోమందికి స్ఫూర్తిదాయకమని, ప్రతి ఒక్కరూ అవయవ దానంపై అవగాహన పెంచుకుని సమాజ హితం కోసం ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ నాయకులు జీలకర్ర వీరస్వామి, దండు చక్రపాణి, ఇనుముల అజయ్, సగరపు వీరస్వామి, దామెర సదానందం, మాదాసు శ్యామ్, కట్కూరి మణికంఠ, చింత అశోక్, ఎండి గౌస్ పాషా పాల్గొన్నారు.



# విజయ డైరీ పునరుద్ధరణకు త్వరలో చర్యలు

- రోజుకు 15 వేల లీటర్ల పాల సేకరణ లక్ష్యంగా కార్యాచరణ








**అక్షరశక్తి,హనుమకొండ:** విజయ డైరీ పునరుద్ధరణకు త్వరలోనే చర్యలు చేపడతామని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ తెలిపారు. రైతులు పశుపోషణపై దృష్టి సారించడం ద్వారా వ్యవసాయంతో పాటు నిరంతర ఆదాయాన్ని పొందవచ్చని, రైతులు తమ అవసరాలకు అనుగుణంగా నాణ్యమైన పశువులను స్వయంగా ఎంపిక చేసుకోవడం ద్వారా పాడి పరిశ్రమను మరింత అభివృద్ధి చేసుకోవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. గురువారం కలెక్టర్ విజయ డైరీ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పాల సేకరణ కేంద్రం, పాల శీతలీకరణ కేంద్రం, బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్లు, పాలు పరీక్షించే ప్రయోగశాలను పరిశీలించి, అక్కడి కార్యకలాపాలు, పాల సేకరణ, నాణ్యతా ప్రమాణాలు, పాల ఉత్పత్తుల తయారీ తదితర అంశాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాడి రైతుల సంక్షేమ సంఘం సభ్యులు, రైతులు, బ్యాంకర్లతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, రైతులు పశువులను పోషించడం ద్వారా నిరంతర ఆదాయం పొందడంతో పాటు ప్రజలకు నాణ్యమైన, స్వచ్ఛమైన పాలను అందించడంలో భాగస్వాములు కావచ్చని అన్నారు. విజయ డైరీతో పశుసంవర్ధక శాఖను అనుసంధానం చేసి, పాడి రైతులకు ఆధునిక పశుపోషణ పద్ధతులు, పశువుల ఎంపిక, పశువైద్య సేవలు, పాల ఉత్పత్తి పెంపు తదితర అంశాలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఇందుకోసం సంబంధిత శాఖల అధికారులతో త్వరలోనే సమన్వయ సమావేశం నిర్వహించి కార్యాచరణ రూపొందిస్తామని కలెక్టర్ తెలిపారు. విజయ డైరీకి పూర్వ వైభవం తీసుకురావడంతో పాటు పాలతోపాటు నెయ్యి, పన్నీరు తదితర ఇతర పాల ఉత్పత్తులను విస్తృతంగా తయారు చేసేలా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన యంత్రాలు, మౌలిక వసతులను సమకూర్చేందుకు చర్యలు చేపడతామని కలెక్టర్ తెలిపారు. విజయ డైరీ డిప్యూటీ డైరెక్టర్ ధనరాజ్ మాట్లాడుతూ, ప్రస్తుతం రోజుకు సుమారు 6 వేల లీటర్ల పాలను ప్రాసెసింగ్ చేస్తున్నామని తెలిపారు. 26 సొసైటీల ద్వారా పాలను సేకరించి, పాలతోపాటు ఇతర పాల ఉత్పత్తులను విజయ డైరీ ద్వారా తయారు చేసి, డిస్ట్రిబ్యూటర్ల ద్వారా మార్కెట్‌లో విక్రయిస్తున్నామని వివరించారు.


గతంలో విజయ డైరీ ద్వారా నెయ్యి, పన్నీరు తదితర పాల ఉత్పత్తులను విస్తృతంగా తయారు చేసి అందించేవారమని, పాల సేకరణ తగ్గిపోవడంతో ఉత్పత్తి సామర్థ్యం కూడా గణనీయంగా తగ్గిందని తెలిపారు. రైతులు పశుపోషణపై మరింత దృష్టి సారించేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. విజయ డైరీ ద్వారా రోజుకు 15 వేల లీటర్ల పాల సేకరణ లక్ష్యాన్ని చేరుకునేలా రైతులను పాడి పరిశ్రమ వైపు ప్రోత్సహించేందుకు కార్యాచరణ చేపడుతున్నామని డిప్యూటీ డైరెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో కాకతీయ విజయ డైరీ సొసైటీ చైర్మన్ ఎరుపు దేవేందర్, కమిటీ సభ్యులు సమ్మయ్య, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ రీజినల్ మేనేజర్ చైతన్య, యూనియన్ బ్యాంక్ మేనేజర్ సత్యసాయి, పాడి రైతులు, డిస్ట్రిబ్యూటర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఫారెస్ట్ ట్రెక్ పార్క్‌లో నేచర్ క్యాంప్

**అక్షరశక్తి,హైదరాబాద్:** మంచిరేవులలోని ఫారెస్ట్ ట్రెక్ పార్క్‌లో తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఆగస్టు 15న సాయంత్రం 4.30 గంటల నుంచి 16న ఉదయం 10 గంటల వరకు నేచర్ క్యాంప్ నిర్వహించనున్నట్లు సీనియర్ డివిజనల్ మేనేజర్, అసిస్టెంట్ డైరెక్టర్ (ఎకో టూరిజం) శిరీష తెలిపారు. ఇందులో బృంద నిర్మాణం, గుడారాల ఏర్పాటు, రాత్రి అడవిలో నడక, నైట్ క్యాంపింగ్, ఉదయం పక్షుల వీక్షణ, ట్రెక్కింగ్, నేచర్ ట్రయల్ వంటి కార్యక్రమాలను నిపుణుల సమక్షంలో నిర్వహించనున్నారు. పాల్గొనే వారికి సాయంత్రం స్నాక్స్, రాత్రి భోజనం, ఉదయం అల్పాహారం అందించనున్నట్లు తెలిపారు. ఈ నేచర్ క్యాంప్‌లో పిల్లలు, పెద్దలు అందరూ పాల్గొనవచ్చని, నేచరలిస్టుల ఆధ్వర్యంలో వివిధ రకాల పక్షులను ప్రత్యక్షంగా చూపిస్తూ వాటి నివాసాలు, గూళ్ల నిర్మాణం, ఆహారపు అలవాట్లు, ఎగిరే విధానం, సామాజిక ప్రవర్తన తదితర అంశాలపై అవగాహన కల్పిస్తారని శిరీష పేర్కొన్నారు. 6 నుంచి 12 ఏళ్ల పిల్లలకు ఒక్కొక్కరికి రూ.1,199, 13 ఏళ్లు పైబడిన వారికి రూ.1,999 రుసుముగా నిర్ణయించారు. ఆసక్తి ఉన్నవారు www.deccanwoodsandtrails.com ద్వారా బుక్ చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 94935 49399, 98852 98980, 92475 86287 నంబర్లను సంప్రదించాలని కోరారు.
















# మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం




- స్వయం సహాయక సంఘాల మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి
- మహిళా వ్యాపారాలకు కొత్త దిశగా 'ఇంక్యుబేటర్ ప్రోగ్రామ్'

**అక్షరశక్తి,ములుగు:** మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి, స్వయం సహాయక సంఘాల సభ్యులను విజయవంతమైన పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని,స్వయం సహాయక సంఘాల మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని,మహిళలు ఉద్యోగాలు అడిగే స్థాయి నుంచి ఉపాధి కల్పించే ఉన్నత స్థాయికి చేరుకోవాలని,మహిళా వ్యాపారాలకు కొత్త దిశగా ఇంక్యుబేటర్ కార్యక్రమం నూతన వేదికగా మారుతుందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. గురువారం జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో గ్రామీణాభివృద్ధి శాఖ, సెర్ప్ తెలంగాణ ఆధ్వర్యంలో బిట్స్ పిలానీ హైదరాబాద్ టెక్నాలజీ బిజినెస్ ఇంక్యుబేటర్ సహకారంతో నిర్వహించిన జిల్లా స్థాయి ఇంక్యుబేటర్ ప్రోగ్రామ్ అవగాహన, ప్రణాళిక కార్యక్రమానికి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

గ్రామీణ మహిళా స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వ్యాపారాలను గుర్తించి, వాటిని మరింత అభివృద్ధి చేసేందుకు అవసరమైన నైపుణ్యాలు, సాంకేతిక పరిజ్ఞానం, వ్యాపార నిర్వహణ, మార్కెటింగ్, ఆర్థిక సహకారం అందించాలని ప్రధాన ఉద్దేశంతో, రాష్ట్రవ్యాప్తంగా సుమారు 300 మహిళా ఆధారిత వ్యాపారాలను గుర్తించి, వాటి సామర్థ్యాన్ని పెంపొందించడం ద్వారా మహిళలను విజయవంతమైన పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు అర్హత కలిగిన మహిళా వ్యాపారవేత్తలకు వ్యాపార విస్తరణ, మార్కెటింగ్, యంత్రాలు, పరికరాలు, ముడిసరుకు తదితర అవసరాల కోసం రూ.లక్ష నుంచి రూ.15 లక్షల వరకు గ్రాంట్ పొందే అవకాశం తో గ్రామీణాభివృద్ధి శాఖ, సెర్ప్ తెలంగాణ ఆధ్వర్యంలో బిట్స్ పిలానీ హైదరాబాద్ టెక్నాలజీ బిజినెస్ ఇంక్యుబేటర్ సహకారంతో నిర్వహించిన జిల్లా స్థాయి ఇంక్యుబేటర్ ప్రోగ్రామ్ ద్వారా ప్రత్యేక శిక్షణ, మార్గదర్శకత్వం అందించనున్నారు.

ఈ సందర్భంగా మంత్రి అనసూయ సీతక్క మాట్లాడుతూ, మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలనే దృఢ సంకల్పంతో ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని అన్నారు. వడ్డీలేని రుణ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచడంతో పాటు మహిళా సంఘాలు తీసుకున్న రుణాలపై వడ్డీని ప్రభుత్వం క్రమం తప్పకుండా చెల్లిస్తోందని, ములుగు జిల్లాలో ఇప్పటివరకు సుమారు రూ.13 కోట్ల వడ్డీ మొత్తాన్ని మహిళలకు తిరిగి చెల్లించినట్లు వెల్లడించారు. అర్హత కలిగిన ఒంటరి, వితంతు మహిళలకు పింఛన్లు అందించే కార్యక్రమాన్ని ఆగస్టు 16వ తేదీన శ్రీ సమ్మక్క-సారలమ్మ సన్నిధి నుంచి ప్రారంభించనున్నట్లు తెలిపారు.

అర్హులైన వారిని గుర్తించి ఆగస్టు 31వ తేదీ వరకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి పింఛన్లు అందించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రజల కోసం పోరాడి వనదేవతలుగా కొలువుదీరిన సమ్మక్క-సారలమ్మ మహిళలందరికీ గొప్ప స్ఫూర్తి అని పేర్కొన్నారు. మహిళలు ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా సొంత వ్యాపారాలను ఏర్పాటు చేసుకొని ఆర్థిక స్వావలంబన సాధించాలని, తద్వారా మరికొందరికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని మంత్రి ఆకాంక్షించారు. బిట్స్ పిలానీ సహకారంతో అందించే శిక్షణను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి మండలం నుంచి వ్యాపారం పట్ల ఆసక్తి, వినూత్న ఆలోచనలు కలిగిన మహిళలను గుర్తించి శిక్షణకు ఎంపిక చేయాలని అధికారులను ఆదేశించారు. చిన్న వ్యాపారంతో ప్రారంభించి సరైన శిక్షణ, మార్కెటింగ్ సదుపాయాలను అందిపుచ్చుకుంటే మహిళలు విజయవంతమైన వ్యాపారవేత్తలుగా ఎదగవచ్చని అన్నారు. ములుగు జిల్లాలోని అపారమైన ప్రకృతి, పర్యాటక సంపదను మహిళల ఆర్థికాభివృద్ధికి అనుసంధానం చేయాలని మంత్రి సూచించారు. మేడారం శ్రీ సమ్మక్క-సారలమ్మ, రామప్ప దేవాలయం, లక్నవరం సరస్సు, బొగత జలపాతం, గోదావరి తీరం, దట్టమైన అడవులతో జిల్లా పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందుతోందని అన్నారు. పర్యాటకుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో క్యాంటీన్లు, మొబైల్ టిఫిన్ కేంద్రాలు, స్థానిక ఆహార ఉత్పత్తుల విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. స్థానికంగా లభించే ఇప్పపువ్వు, అరటి, మిరప తదితర ఉత్పత్తులకు విలువ జోడించి ప్యాకేజింగ్, మార్కెటింగ్ చేయడం ద్వారా మహిళలకు స్థిరమైన ఆదాయం సమకూరుతుందని తెలిపారు.

మహిళా సంఘాల విజయగాథలు ఇతర మహిళలకు స్ఫూర్తినిచ్చేలా ప్రత్యేక మాసపత్రికను రూపొందిస్తున్నామని మంత్రి తెలిపారు. చిన్న స్థాయి నుంచి వ్యాపారవేత్తలుగా ఎదిగిన మహిళలు చేపట్టిన వ్యాపారాలు, సాధించిన విజయాలను అందులో ప్రచురిస్తామని చెప్పారు. గ్రామ, మండల స్థాయిలో విజయవంతమైన మహిళా వ్యాపారవేత్తలను గుర్తించి వారి విజయగాథలను సెర్ప్‌కు పంపించాలని, ఫొటోలు, కథనాలు, వీడియోల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా మహిళా సంఘాలకు చేరవేయాలని అధికారులకు సూచించారు. ములుగు జిల్లా భవిష్యత్తులో ప్రధాన పర్యాటక, విద్యా, వైద్య కేంద్రంగా మరింత అభివృద్ధి చెందుతుందని మంత్రి పేర్కొన్నారు. నూతన కలెక్టరేట్, మెడికల్ కళాశాల, నర్సింగ్ కళాశాల, సమ్మక్క-సారక్క కేంద్ర గిరిజన విశ్వవిద్యాలయం, యంగ్ ఇండియా సమీకృత గురుకుల విద్యాలయం వంటి ప్రతిష్ఠాత్మక సంస్థలతో జిల్లాలో వ్యాపార అవకాశాలు మరింత విస్తరిస్తాయని తెలిపారు. ఈ అవకాశాలను మహిళా సంఘాలు అందిపుచ్చుకునేలా అధికారులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. జిల్లా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో సుమారు రూ.1 కోటి 50 లక్షల తో ఏర్పాటు చేస్తున్న పెట్రోల్ బంక్‌ను ప్రారంభించనున్నట్లు తెలిపారు. మహిళలను కేవలం లబ్ధిదారులుగా కాకుండా వ్యాపారవేత్తలుగా, మరికొందరికి ఉపాధి కల్పించే శక్తిగా తీర్చిదిద్దడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, డీఆర్డీఓ రవీందర్, బిట్స్ పిలానీ ఇంక్యుబేటర్ ప్రోగ్రామ్ ప్రాజెక్ట్ మేనేజర్ నవీన్ కృష్ణ,జిల్లా విద్యాశాఖ అధికారి సిద్ధార్థ రెడ్డి, ములుగు మున్సిపాలిటీ చైర్‌పర్సన్ చింతనిప్పుల చంద్రకళ, అదనపు డీఆర్డీఓ శ్రీనివాస్,ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ కె. అనూష, డీపీఎంలు, ఏపీఎంలు, సీఏలు, మహిళా సంఘాల సభ్యులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మొబైల్ ఆరోగ్య శిబిరానికి విశేష స్పందన



**అక్షరశక్తి,హనుమకొండ:** సాయిబాబా మందిరంలో గురువారం నిర్వహించిన మొబైల్ ఆరోగ్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఆదిత్య బిర్లా ఫౌండేషన్, స్మైల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో జితేందర్ సింగ్ నగర్ వాసులతో పాటు మందిరానికి విచ్చేసిన పలువురు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ సిద్ధార్థ వైద్య పరీక్షలు నిర్వహించి, భక్తులు మరియు స్థానికుల ఆరోగ్య పరిస్థితులను పరిశీలించారు. వివిధ రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించడంతో పాటు, అవసరమైన వారికి ఆరోగ్యంపై తగిన సూచనలు, సలహాలు అందించారు. అవసరాన్ని బట్టి ఉచితంగా మందులు కూడా పంపిణీ చేశారు. మొబైల్ ఆరోగ్య శిబిరం ద్వారా ప్రజలకు అందుబాటులోనే వైద్య సేవలు లభించడంతో జితేందర్ సింగ్ నగర్ వాసులు, భక్తులు సంతోషం వ్యక్తం చేశారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో మందిరం చైర్మన్ మతుకుమల్లి హరగోపాల్, ధర్మకర్త మరియు పీఆర్వో నిమ్మల శ్రీనివాస్, బిర్లా ఫౌండేషన్ ప్రతినిధి నవీన్, మందిర సిబ్బంది రాజు, సాయి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు. శ్రావణమాసం మొదటి గురువారం కావటంతో మందిరం భక్తులతో కిటకిటలాడింది. మధ్యాహ్న హారతి అనంతరం మందిరంలో జరిగిన అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పర్యావరణహిత విగ్రహాలనే వాడదాం: కోడిమాల శ్రీనివాసరావు



**అక్షరశక్తి, వరంగల్:** రానున్న గణేష్ నవరాత్రులు, శరన్నవరాత్రుల సందర్భంగా మట్టి విగ్రహాలను వినియోగించి పర్యావరణాన్ని పరిరక్షించాలని యూత్ ఫర్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు కోడిమాల శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. "మట్టి విగ్రహాలనే వాడదాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం" అనే నినాదంతో స్థానిక మట్టి విగ్రహాల తయారీ కేంద్రంలో యూత్ లీడర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వరంగల్ మహానగరంలో సుమారు 8 నుంచి 10 వేల పీఓపీ విగ్రహాలను ఏర్పాటు చేసి జలాశయాల్లో నిమజ్జనం చేస్తున్నారని, పీఓపీ, రసాయన రంగుల వల్ల నీరు, భూమి, పర్యావరణం కలుషితమవుతున్నాయని ఆయన తెలిపారు. జలచరాలు మృత్యువాత పడటంతో పాటు భూగర్భజలాలు కలుషితమయ్యే ప్రమాదం ఉందన్నారు. ప్రజలందరూ, ముఖ్యంగా వినాయక మండపాల నిర్వాహకులు పర్యావరణహితమైన మట్టి విగ్రహాలను ఏర్పాటు చేసి పూజించాలని కోడిమాల శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. వినాయకుడు, దుర్గామాత ప్రకృతి ప్రేమికులని, స్థానికంగా లభించే సహజ పూజా ద్రవ్యాలతోనే పూజలు నిర్వహించాలని సూచించారు. మట్టి విగ్రహాల తయారీదారులకు ప్రభుత్వం, స్థానిక సంస్థలు ప్రోత్సాహకాలు, సబ్సిడీలు అందిస్తే మరిన్ని మట్టి విగ్రహాల తయారీకి అవకాశం ఏర్పడి పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందని అన్నారు. కార్యక్రమంలో యూత్ ఫర్ సొసైటీ నిర్వాహకులు దేవిశ్రీప్రసాద్, సాకేత్, దస్తగిరి, నీరజ్, రుత్విక్ చంద్ర, విష్ణుదత్త, రోహిత్‌కుమార్, నాగచైతన్య, సాయి చరణ్, రామ్‌చరణ్, మణిదీప్, నవీన్, కనకం రవి, టి.అశోక్ తదితరులు పాల్గొన్నారు.









## ప్రపంచ అవయవ దాన దినోత్సవం

**అక్షరశక్తి, వరంగల్:** ప్రభుత్వ డిగ్రీ కళాశాల రంగసాయపేట వరంగల్ జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో ప్రపంచ అవయవదాన దినోత్సవ కార్యక్రమం కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఆగస్టు 13న ప్రపంచవ్యాప్తంగా అవయవ దాన దినోత్సవం జరుపుకుంటామని అవయవాలను దానం చేయడం ద్వారా ప్రాణాపాయంలో ఉన్న ఎందరో వ్యక్తులకు పునర్జన్మనిస్తుందని అవగాహనను ప్రజల్లో కల్పించడం దీని ప్రధాన ఉద్దేశం అని తెలిపారు. దేహంలో గుండె,కాలేయం మూత్రపిండాలు, ఊపిరితిత్తులు, ఫ్యాంక్రియాస్, పేగులు, కళ్ళు వంటి అమూల్యమైన అవయవాలను దానం చేయడం వల్ల ఎంతోమందికి ప్రాణదాతలుగా మిగులుతారని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ జి భగీరద్ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ఆరోగ్యవంతులైన వారు రిజిస్ట్రేషన్ చేయించుకొని అవయవ దానం చేయొచ్చని వివరించారు. అంతేగాక అవయవదాన దినోత్సవ ప్రాధాన్యతను విపులంగా వివరించారు. ఈ కార్యక్రమంలో అవయవదాన దినోత్సవ ప్రాధాన్యత పోస్టర్ను ప్రిన్సిపాల్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీమతి ఆర్ ప్రేమలత అధ్యాపకులు డాక్టర్ పి ఎల్ ఎన్ మూర్తి, డాక్టర్ సుస్మిత, డాక్టర్ శైలజ, డాక్టర్ మీనాజుద్దీన్, డాక్టర్ నాగ పరమేశ్వర చారి, డాక్టర్ కృష్ణవేణి, డాక్టర్ రాజన్న డాక్టర్ ప్రభావతి, గీత, ప్రదీప్ ఆశాజ్యోతి తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## అక్షర శక్తి కథనానికి స్పందన..

### సౌమ్యకు అండగా నిలిచిన యువ నేత విష్ణువర్ధన్ రెడ్డి




**అక్షరశక్తి, హనుమకొండ:** అక్షర శక్తిలో ప్రచురితమైన కథనానికి స్పందించిన యువ నేత విష్ణువర్ధన్ రెడ్డి గురువారం పబ్లిక్ గార్డెన్‌లో సౌమ్య నిర్వహిస్తున్న దుకాణాన్ని సందర్శించారు. ఆత్మవిశ్వాసం చివరి అంచు అనే మానవీయ కథనానికి విష్ణు స్పందించారు. సౌమ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న ఆయన, ఆమెకు జరగాల్సిన సర్జరీ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి తగిన సహాయం అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సౌమ్యకు సహాయం అందించాలనే ఉద్దేశంతో సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్ పలుమార్లు యువ నేత విష్ణువర్ధన్ రెడ్డికి ఫోన్ చేసి పరిస్థితిని వివరించి, ఆమెకు అండగా నిలవాలని కోరినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో స్పందించిన విష్ణువర్ధన్ రెడ్డి స్వయంగా సౌమ్యను కలిసి ఆమెకు భరోసా కల్పించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. అక్షర శక్తి కథనం ద్వారా సౌమ్య సమస్య ప్రజల దృష్టికి రావడంతో, ప్రజాప్రతినిధులు, సామాజికవేత్తలు స్పందించి సహాయం చేసేందుకు ముందుకు రావడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. సౌమ్య సర్జరీకి అవసరమైన సహాయం అందించేందుకు తన వంతు కృషి చేస్తానని విష్ణువర్ధన్ రెడ్డి స్పష్టం చేశారు.


అక్షరశక్తి 8 Telugu Trending News

ఆత్మవిశ్వాసం
చివరి అంచు!

# ములుగు ముస్తాబు!

- తల్లుల చెంత నుంచే మహిళలకు 'పింఛన్'
- సీఎం రాకకు వనదేవతల సన్నిధి సిద్ధం
- హంగులందద్దుకున్న కలెక్టరేట్..
- కనువిందు చేస్తున్న పైలాన్..
- ముఖ్యమంత్రి పర్యటనకు చకచకా ఏర్పాట్లు..
- పరిశీలించిన మంత్రి సీతక్క
- గడువులోపు పనులు పూర్తి చేయాలని ఆదేశం



**అక్షరశక్తి, ములుగు:** మేడారం వేదికగా మరో కీలక కార్యక్రమానికి ములుగు సిద్ధమవుతోంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెల 16న ములుగు జిల్లాలో పర్యటించనుండటంతో అధికారులు ఏర్పాట్లను పరుగులు పెట్టిస్తున్నారు. వనదేవతల సన్నిధిలో సీఎం ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు.. అక్కడి నుంచే ఒంటరి, వితంతు మహిళల పింఛన్ల పంపిణీకి శ్రీకారం చుట్టనుండం మేడారం ప్రత్యేక ప్రాధాన్యం సంతరించుకుంది. సీఎం పర్యటనకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా మేడారం నుంచి నూతన కలెక్టరేట్ వరకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. పైలాన్ నిర్మాణం తుది దశకు చేరుకోవడంతో కొత్త అందాలను సంతరించుకుంది. నూతన కలెక్టరేట్ భవన సముదాయం సైతం ముఖ్యమంత్రి పర్యటనకు సిద్ధమవుతోంది. ఏర్పాట్లను గురువారం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క గురువారం పరిశీలించారు. కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, ఎస్పీ సుధీర్ రామ్ నాథ్ కేకన్, ఐటీడీఏ పీవో లెనిన్ వస్సల్ టోప్పోతో కలిసి మేడారం, పైలాన్, కలెక్టరేట్ ప్రాంతాల్లో జరుగుతున్న పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.

**పనుల్లో వేగం.. నాణ్యతకు పెద్దపీట**

ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన ప్రతి ఏర్పాటును ముందుగానే పూర్తి చేయాలని సీతక్క అధికారులను ఆదేశించారు. పైలాన్ నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ వేగంగా పూర్తి చేయాలని సూచించారు. పనుల్లో జాప్యానికి తావులేకుండా అధికారులు, కాంట్రాక్టర్లు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. కలెక్టరేట్ భవన సముదాయాన్ని పరిశీలించిన మంత్రి.. వివిధ విభాగాలు, కార్యాలయ గదులు, సమావేశ మందిరాలు, పరిసరాల్లో జరుగుతున్న పనులను పరిశీలించారు. పారిశుధ్యం, విద్యుత్, తాగునీరు, రహదారులు, పార్కింగ్ తదితర మౌలిక వసతులను పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. అప్పగించిన బాధ్యతలను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని మంత్రి సీతక్క ఆదేశించారు.

**వనదేవతల సన్నిధి నుంచే పింఛన్లకు శ్రీకారం**

సమ్మక్క-సారలమ్మ వనదేవతలను దర్శించుకున్న అనంతరం అర్హులైన ఒంటరి, వితంతు మహిళలకు పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని సీఎం ప్రారంభించనున్నారని సీతక్క వెల్లడించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పింఛన్ అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఆగస్టు 31 వరకు దరఖాస్తులు స్వీకరించి అర్హులను గుర్తించి పింఛన్లు అందించనున్నట్లు తెలిపారు. వనదేవతలను సమ్మక్క-సారలమ్మ తల్లుల దీవెనలతో ప్రతి మహిళ సంతోషంగా, ఆత్మగౌరవంతో జీవించాలన్న సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని వారి సన్నిధి నుంచే ప్రారంభిస్తున్నామని పేర్కొన్నారు. గతంలో అమల్లో ఉన్న నిబంధనల ప్రకారం పరిశీలించి అర్హులను ఎంపిక చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. మేడారం కార్యక్రమాల అనంతరం ముఖ్యమంత్రి ములుగు జిల్లా కేంద్రానికి చేరుకుని, రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీరాజ్ శాఖ ద్వారా మూడు విడతల్లో సుమారు రూ.16 వేల కోట్లతో చేపట్టనున్న హ్యామ్ రోడ్ల పనులకు సంబంధించిన అభివృద్ధి పనుల పైలాన్‌ను గట్టమ్మ సమీపంలో ఆవిష్కరిస్తారని తెలిపారు. ప్రతి గ్రామానికి మెరుగైన రహదారి అనుసంధానం కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ విధానంలో పెద్ద ఎత్తున రహదారి పనులను చేపట్టడం జరుగుతుందని పేర్కొన్నారు. అనంతరం ముఖ్యమంత్రి నూతన కలెక్టరేట్‌కు చేరుకుని తొలుత తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించి, నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయాన్ని ప్రారంభిస్తారని మంత్రి తెలిపారు. కలెక్టరేట్ ఆవరణంలో ఏర్పాటు చేసే సభలో ప్రజలు, అభిమానులను ఉద్దేశించి ముఖ్యమంత్రి ప్రసంగిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏటూర్ నాగారం ఏఎస్పీ మనన్ భట్, జిల్లా అదనపు కలెక్టర్లు సీహెచ్ మహేందర్ జి, సంపత్ రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి, ఆర్డీవో కృష్ణవేణి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### మేడారంపై సీఎంకు ప్రత్యేక దృష్టి

మేడారం ఆలయ ప్రాంగణంలో మిగిలిన అభివృద్ధి పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తున్నట్లు సీతక్క తెలిపారు. మేడారం వనదేవతల సన్నిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులు, ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను అధికారులతో పరిశీలించి మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పటికే రెండు సార్లు మేడారం వచ్చి ఆలయ అభివృద్ధిపై ప్రత్యేక చొరవ చూపారని చెప్పారు. ఈ పర్యటనలో ఆలయ ప్రాంగణాన్ని పరిశీలించి భవిష్యత్ విస్తరణ, అభివృద్ధి పనులపై సూచనలు, సలహాలు, ఆదేశాలు ఇవ్వనున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి ఆలోచనలు, మార్గదర్శకత్వానికి అనుగుణంగా మేడారాన్ని మరింత అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. మేడారానికి వస్తున్న సీఎం రేవంత్ రెడ్డితో పాటు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులకు ములుగు జిల్లా, నియోజకవర్గ ప్రజల తరఫున పేరు పేరునా స్వాగతం పలుకుతున్నామని మంత్రి సీతక్క తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం ముఖ్యమంత్రి మేడారం ఆలయ ప్రాంగణంలో పర్యటించనున్న నేపథ్యంలో భక్తులు, స్థానిక ప్రజలు అధికార యంత్రాంగానికి సహకరించాలని కోరారు. ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేస్తున్నారని పేర్కొన్నారు.








# ఘనంగా 'హర్ ఘర్ తిరంగా' ర్యాలీ

**అక్షరశక్తి,హనుమకొండ:** 'హర్ ఘర్ తిరంగా' అభియాన్‌లో భాగంగా గురువారం సాయంత్రం బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ తిరంగా ర్యాలీ నిర్వహించారు. వేయిస్తంభాల గుడి నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు సాగిన ఈ ర్యాలీలో టీచర్స్ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులు, యువత, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని మువ్వన్నెల జెండాలను చేతబూని దేశభక్తి నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మల్క కొమరయ్య మాట్లాడుతూ, 'వికసిత్ భారత్' సాధించడమే ప్రతి భారతీయుడి సమష్టి సంకల్పం కావాలని అన్నారు. త్రివర్ణ పతాకాన్ని గర్వంగా చేతబట్టి ముందుకు సాగుతున్న ప్రతి ఒక్కరూ స్వాతంత్ర్య సమరయోధులు, వీర జవాన్ల త్యాగాలను స్మరించుకోవాలని పిలుపునిచ్చారు. వారి ధైర్యం, అంకితభావం, దేశసేవ ఫలితంగానే భారత్ నేడు ప్రగతి పథంలో ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం నూతన ఆత్మవిశ్వాసంతో, మరింత బలంగా అభివృద్ధి దిశగా పయనిస్తోందని కొమరయ్య అన్నారు. త్రివర్ణ పతాకాన్ని చేతబట్టడమే కాకుండా దాని స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ తమ హృదయాల్లో నిలుపుకోవాలని, శక్తివంతమైన, సుసంపన్నమైన, ఆత్మనిర్భర భారత నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ర్యాలీ సందర్భంగా 'వందేమాతరం', 'భారత్ మాతాకీ జై' నినాదాలతో హనుమకొండ నగరం మార్మోగింది. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు రావు పద్మారెడ్డి, డా. పగడాల కాళీప్రసాద్ రావు, గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, మాజీ మేయర్ డా. టి. రాజేశ్వర్ రావు, మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు, డా. పెసరు విజయ్ చందర్ రెడ్డి, పులి సర్రోతం రెడ్డి, మాజీ కార్పొరేటర్లు చాడ స్వాతి శ్రీనివాస్ రెడ్డి, రావుల కోమల కిషన్, గుజ్జుల వసంత మహేందర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు ఆర్.పి. జయంత్ లాల్, దేవనూరి మేఘనాథ్‌తో పాటు జిల్లా నాయకులు, వివిధ డివిజన్, మండల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# ఆధునిక సాంకేతికతతో విద్యుత్ పంపిణీ వ్యవస్థ మరింత పటిష్టం

**అక్షరశక్తి,హనుమకొండ:** వినియోగదారులకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించేందుకు భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఆధునిక సాంకేతికతతో విద్యుత్ పంపిణీ వ్యవస్థను మరింత పటిష్టం చేస్తున్నట్లు టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి తెలిపారు. గురువారం నక్కలగుట్ట విద్యుత్ భవన్ ప్రధాన కార్యాలయం నుంచి టీజీఎన్‌పీడీసీఎల్ పరిధిలోని 18 సర్కిళ్ల ఎస్ఈలు, డీఈలు, ఏడీఈలు, ఏఈలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న వ్యవసాయ విద్యుత్ సర్వీసులను యుద్ధప్రాతిపదికన మంజూరు చేయాలని, క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. 11 కేవీ ఫీడర్ల జీఐఎస్ మ్యాపింగ్‌లో పెండింగ్ పనులను త్వరితగతిన




పూర్తి చేయాలని సీఎండీ సూచించారు. టీజీఐ పాస్, ఈవీ చార్జింగ్ స్టేషన్లకు సంబంధించిన పనులను వేగవంతం చేసి నిర్దేశిత లక్ష్యాలను సకాలంలో సాధించాలన్నారు. సబ్‌స్టేషన్ల నిర్మాణానికి అవసరమైన స్థలాలను గుర్తించి, భూముల పరిశీలనతో పాటు ఇతర ప్రక్రియలను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. 33 కేవీ ఇంటర్‌లింకింగ్ లైన్ల పనుల పురోగతిని సమీక్షించి, మిగిలిన పనులను గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. విద్యుత్ పంపిణీ వ్యవస్థను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు రిమోట్ మానిటరింగ్ సబ్‌స్టేషన్లు, ఫీడర్ డిజిటలైజేషన్, ఇంటర్‌లింకింగ్ లైన్లు, కవర్డ్ కండక్టర్ల వంటి ఆధునిక సాంకేతిక విధానాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కర్నాటి వరుణ్ రెడ్డి అధికారులకు దిశానిర్దేశం చేశారు. పనులకు అవసరమైన మెటీరియల్ అందుబాటులో ఉందని, ముందస్తు ప్రణాళికతో వ్యవహరించి అన్ని అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో డైరెక్టర్లు వి. మోహన్‌రావు, టి. మధుసూదన్, చీఫ్ ఇంజినీర్లు కె. అశోక్, అన్నపూర్ణ, సురేందర్, గౌతమ్‌రెడ్డి, జీఎంలు మధుసూదన్‌రావు, ప్రభావతి, ఎస్ఈ సివిల్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ పోలీస్ అధికారుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



**అక్షరశక్తి, హనుమకొండ:** వరంగల్ కమిషనరేట్ కార్యాలయంలోని రాణి రుద్రమదేవి ప్రాంగణంలో గురువారం వరంగల్ పోలీస్ అధికారుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నికలు నిర్వహించారు. పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ ఆదేశాల మేరకు ఎన్నికల నోడల్ అధికారి అదనపు డీసీపీ ప్రభాకర్ రావు, ఎన్నికల నిర్వహణ కమిటీ సభ్యులు అదనపు డీసీపీ శ్రీనివాస్, ఏసీపీలు సదయ్య, నాగయ్యల పర్యవేక్షణలో ఎన్నికలు పారదర్శకంగా జరిగాయి. మొత్తం 110 మంది వివిధ హోదాల్లోని పోలీస్ అధికారులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికల ప్రక్రియను పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత పరిశీలించి, పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులకు పలు సూచనలు



చేశారు. ఎన్నికల్లో ధర్మసాగర్ పోలీస్ స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ కొండా కరుణాకర్, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ టి. బాబుపై 17 ఓట్ల ఆధిక్యంతో అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా బి. సతీష్, బి. శరత్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా దామెర ఎస్ఐ ఇ. వీరభద్రరావు, సంయుక్త కార్యదర్శిగా టి. నరేష్, కార్యనిర్వహణ కార్యదర్శిగా ఎస్. ప్రవీణ్ కుమార్, కోశాధికారిగా బి. నరేష్ ఎన్నికయ్యారు. కార్యనిర్వాహక సభ్యులుగా ఎం. తులసి, సి.హెచ్. మహేందర్ యాదవ్, ఏ. రమేష్, ఎన్. ప్రవీణ్, ఎం.డి. తాజుద్దీన్, పి. సర్వేశ్ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ సభ్యులను పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత అభినందించారు.



కొండా కరుణాకర్ యాదవ్ అధ్యక్షులు



వీరభద్ర యాదవ్ సెక్రటరీ

## ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఫోటోగ్రాఫర్ హరీష్‌కు ఘన సన్మానం



**అక్షరశక్తి, హనుమకొండ:** ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా జాతీయస్థాయిలో నిర్వహించిన ఫోటోగ్రఫీ పోటీల్లో "బెస్ట్ అచీవ్‌మెంట్ అవార్డు"కు ఎంపికైన గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ కార్యవర్గ సభ్యుడు, ఆంధ్రజ్యోతి దినపత్రిక డిప్యూటీ చీఫ్ ఫోటోగ్రాఫర్ వీరగోని హరీష్‌ను గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వేముల నాగరాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో హరీష్‌కు శాలువా కప్పి, మెమోంటో అందజేసి అభినందనలు తెలిపారు. ఫోటోగ్రఫీ రంగంలో విశేష ప్రతిభ కనబరుస్తూ ఇప్పటికే ఎన్నో అవార్డులు అందుకున్న హరీష్ జాతీయస్థాయిలో మరో ప్రతిష్టాత్మక పురస్కారానికి ఎంపిక కావడం వరంగల్ జర్నలిస్టు సమాజానికి గర్వకారణమని వారు పేర్కొన్నారు. హరీష్ భవిష్యత్తులో మరింత ప్రతిభతో పనిచేస్తూ మరిన్ని జాతీయ, అంతర్జాతీయ అవార్డులు సాధించాలని ప్రెస్ క్లబ్ కమిటీ ఆకాంక్షించింది. జర్నలిజంలో ఫోటోగ్రఫీకి ఉన్న ప్రాధాన్యతను చాటుతూ, సమాజంలోని వాస్తవ పరిస్థితులను తన కెమెరా ద్వారా ప్రజలకు అందించడంలో హరీష్ చేస్తున్న కృషిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి బొల్లారం సదయ్య, కోశాధికారి బొళ్ల అమర్, ఉపాధ్యక్షులు గోకారపు శ్యాం కుమార్, బొడిగె శ్రీను, అల్లం రాజేష్ వర్మ, యంసాని శ్రీనివాస్, జాయింట్ సెక్రెటరీలు సంపేట సుధాకర్, పెద్దపల్లి వరప్రసాద్, పోడిచెట్టి విష్ణువర్ధన్, కార్యవర్గ సభ్యులు జనగాని ఆంజనేయులు, ఎండి నయీమ్ పాష, కమటం వేణుగోపాల్, నన్నపనేని భరత్ కుమార్, మంచాల రాజు, బలువారి విజయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్ట్స్ కళాశాలలో క్యాంటీన్ ప్రారంభం



**అక్షరశక్తి,హనుమకొండ:** సుబేదారిలోని కాకతీయ విశ్వవిద్యాలయం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో నిర్వాహకులు సుదర్శన్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన క్యాంటీన్‌ను హనుమకొండ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బందికి నాణ్యమైన ఆహారం, అల్పాహారం అందుబాటులో ఉండేలా క్యాంటీన్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుకారి జ్యోతి మాట్లాడుతూ విద్యార్థుల సౌకర్యార్థం నూతన క్యాంటీన్‌ను ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. విద్యార్థులకు అందుబాటులో ఉండే ధరలకు నాణ్యమైన ఆహారాన్ని అందించేలా క్యాంటీన్ నిర్వహణ కొనసాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ సుదర్శన్, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ నిర్మల, ఆర్ట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రెహ్మాన్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

GUEST COLUMN

# బీసీలకు న్యాయం ఎక్కడ జరిగింది? మాటల్లోనా? చేతల్లోనా?

తెలంగాణ ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్‌కు ఆధారంగా కుల, సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ పరిస్థితులపై నిర్వహించిన సమగ్ర సర్వేను ముందుకు తెచ్చింది. మాజీ ఐఏఎస్ అధికారి బి. వెంకటేశ్వరరావు నేతృత్వంలోని ఏకసభ్య కమిషన్ కూడా అందుబాటులో ఉన్న సామాజిక, విద్యా, ఆర్థిక వెనుకబాటుతనం మరియు ప్రాతినిధ్య సమాచారాన్ని పరిశీలించి, విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల రాజకీయ ప్రాతినిధ్యంలో బీసీలకు కనీసం 42 శాతం రిజర్వేషన్ అవసరమని సిఫారసు చేసింది.

ఈ అంశంలో బీసీ ఉద్యమ నాయకుడు, మాజీ ఐఏఎస్ అధికారి చిరంజీవులు వ్యక్తం చేస్తున్న దృక్పథం ప్రత్యేకంగా గమనించదగినది. బీసీల సమస్యను కేవలం రిజర్వేషన్ శాతానికి పరిమితం చేయకుండా, హక్కులపై సామాజిక చైతన్యం పెరగాలని, బీసీలు తమలోని ఆత్మనూన్యతను విడిచిపెట్టి హక్కుల కోసం సంఘటితంగా పోరాడాలని ఆయన పదేపదే చెబుతున్నారు. 2025లో బీసీ మేధావుల వేదికలో ఆయన విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లను వెంటనే అమలు చేయాలని కోరారు. తరువాత బీసీ రాజ్యాధికార సభలో 42 శాతం రిజర్వేషన్‌కు శాశ్వత రక్షణ కోసం దానిని తొమ్మిదో షెడ్యూలులో చేర్చాలని కూడా డిమాండ్ చేశారు.

చిరంజీవుల వాదనలోని ముఖ్యమైన అంశం ఇక్కడే ఉంది. రిజర్వేషన్ అనేది కేవలం ప్రభుత్వ ఉద్యోగంలో ఒక సీటు పొందే అవకాశం కాదు. నిర్ణయాధికార వ్యవస్థలో చారిత్రకంగా తక్కువగా ఉన్న వర్గాలకు ప్రవేశం కల్పించే ప్రజాస్వామ్య సాధనం. అందుకే బీసీ ఉద్యమం ఇప్పుడు “ఎంత శాతం?” అనే ప్రశ్నను దాటి “ఎవరి చేతుల్లో అధికారం?” అనే ప్రశ్నను ముందుకు తెస్తోంది. 42 శాతం రిజర్వేషన్ సాధన కోసం మాజీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఈశ్వరయ్య, మాజీ ఐఏఎస్ అధికారి చిరంజీవులు, విశారదన్ మహారాజ్, బాలరాజు గౌడ్, తదితరుల నేతృత్వంలో ప్రత్యేక సాధన సమితి ఏర్పడటం ఈ డిమాండ్ రాజకీయంగా ఎంత విస్తృతమైందో చూపుతోంది.

బీసీ ఉద్యమానికి దీర్ఘకాలంగా నాయకత్వం వహిస్తున్న ఆర్. కృష్ణయ్య మరింత స్పష్టమైన రాజకీయ దృష్టిని

> తెలంగాణలో స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న డిమాండ్ ఇప్పుడు ఒక ఎన్నికల హామీగా కాకుండా, భారత ప్రజాస్వామ్యంలో సామాజిక న్యాయం ఎంతవరకు ఆచరణలోకి వస్తుందనే ప్రశ్నగా మారింది. దీనిని కేవలం కాంగ్రెస్–బీజేపీ రాజకీయ వివాదంగా చూడటం సమస్య యొక్క అసలు స్వరూపాన్ని పక్కదారి పట్టించి, ప్రధాన సమస్యలను అనుమానించ దగిన అంశంగా, చిన్నదిగా చూపడమే అవుతుంది. ఇది బీసీల జనాభా, వారి సామాజిక వెనుకబాటుతనం, రాజకీయ ప్రాతినిధ్యం, రాజ్యాంగ పరిమితులు, న్యాయవ్యవస్థ పాత్ర, కేంద్ర–రాష్ట్ర సంబంధాలు అన్నింటినీ కలగలిపిన సంక్లిష్టమైన ప్రశ్న.

ముందుకు తెచ్చారు. స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ అమలు చేయడమే కాకుండా, జనాభా ప్రాతిపదికన అవసరమైతే రిజర్వేషన్లను పెంచే రాజ్యాంగపరమైన మార్గాలను అన్వేషించాలని ఆయన వాదిస్తున్నారు. 42 శాతం అమలు లేకుండా స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లకూడదని కూడా ఆయన స్పష్టం చేశారు. ఆయన దృష్టిలో ఇది ఒక ప్రభుత్వానికి సంబంధించిన అంశం కాదు. బీసీల రాజకీయ హక్కుల కోసం దీర్ఘకాలిక ఉద్యమానికి సంబంధించిన ప్రశ్న.

అయితే ఈ డిమాండ్‌కు మేధోపరమైన బలం కేవలం ఉద్యమ నాయకుల వాదనల వల్ల రాదు. తెలంగాణ కుల సర్వేలో వెలుగులోకి వచ్చిన గణాంకాలే దీనికి అసలు పునాది. రాజకీయ సిద్ధాంతవేత్త, సామాజిక ఆలోచనాపరుడు ప్రొఫెసర్ కంచ ఐలయ్య షెపర్డ్ విశ్లేషణ ప్రకారం తెలంగాణలో బీసీల మొత్తం వాటా 56.33 శాతంగా నమోదైంది. ఆయన అభిప్రాయం ప్రకారం ఈ గణాంకాలు 42 శాతం రిజర్వేషన్‌కు ప్రభుత్వానికి న్యాయస్థానంలో వాదించడానికి అవసరమైన సంఖ్యాత్మక ఆధారాన్ని బలపరుస్తాయి. ఆయన ప్రత్యేకంగా చెప్పిన మరో అంశం, సర్వేను కేవలం జనాభా లెక్కగా కాకుండా సామాజిక వెనుకబాటుతనాన్ని అర్థం చేసుకునే సాధనంగా ఉపయోగించాలి.

ఇక్కడ కంచ ఐలయ్య అభిప్రాయం ఒక ముఖ్యమైన మేధోపరమైన మలుపును సూచిస్తుంది. బీసీలను ఒకే సమూహంగా చూసి ఒకే రకమైన సంక్షేమ విధానం అమలు చేయడం సరిపోదు. తెలంగాణలో రూపొందించిన వెనుకబాటుతన సూచీ సామాజిక స్థితి, విద్య, ఉపాధి, ఆస్తులు, జీవన ప్రమాణాలు వంటి అనేక సూచికల ఆధారంగా కులాల మధ్య వ్యత్యాసాలను గుర్తించే ప్రయత్నం చేస్తోంది. ఆర్థికవేత్త ప్రవీణ్ చక్రవర్తి నేతృత్వంలోని నిపుణుల బృందం 243 కులాలను 42 ప్రమాణాల ఆధారంగా విశ్లేషించి, వెనుకబాటుతనానికి వివిధ స్థాయిలను గుర్తించే విధానాన్ని రూపొందించింది.

అంటే రిజర్వేషన్ చర్చ ఇకపై కేవలం “బీసీల జనాభా ఎంత?” అనే ప్రశ్నతో ముగియకూడదు. “బీసీలలో ఎవరు ఎంత వెనుకబడి ఉన్నారు?”, “రిజర్వేషన్ ప్రయోజనాలు ఎవరికి ఎక్కువగా చేరుతున్నాయి?”, “అత్యంత వెనుకబడిన కులాలకు ప్రాతినిధ్యం ఎంత?” అనే ప్రశ్నలు కూడా సమానంగా ముఖ్యమైనవి. కేంద్ర స్థాయిలో జస్టిస్ రోహిణీ కమిషన్ పరిశీలనలూ ఇదే సమస్యను చూపించాయి. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యాసంస్థలలో లభించిన సమాచారంపై కమిషన్ చేసిన విశ్లేషణలో బీసీ రిజర్వేషన్ ప్రయోజనాలు కొద్దిమంది కులాల్లోనే అధికంగా కేంద్రీకృతమై ఉన్నాయని, వందలాది బీసీ కులాలకు ప్రయోజనం చాలా తక్కువగా లేదా అసలు లేనట్టుగా వెల్లడైంది. కాబట్టి 42 శాతం రిజర్వేషన్‌తో పాటు బీసీల అంతర్గత ఉపవర్గీకరణ, అత్యంత వెనుకబడిన కులాలకు లక్ష్యిత విధానాలు కూడా అవసరం.

ఇదే విషయాన్ని తెలంగాణపై రాసిన విశ్లేషణల్లో విద్యావేత్తలు, సామాజిక శాస్త్ర పరిశోధకులు కూడా ప్రస్తావిస్తున్నారు. తెలంగాణలో బీసీల జనాభా 56 శాతానికి పైగా ఉంటే, రాష్ట్ర స్థాయి రిజర్వేషన్ 29 శాతంగా ఉండటం జనాభా, ప్రాతినిధ్యం మధ్య వ్యత్యాసాన్ని చూపుతుందని వి.వెంకటనారాయణ మోత్కూరి తన విశ్లేషణలో పేర్కొన్నారు. అయితే 42 శాతం అమలు విషయంలో న్యాయపరమైన అడ్డంకులు, 50 శాతం పరిమితి, సమగ్ర డేటా ఆధారంగా చట్టాన్ని రక్షించాల్సిన అవసరం వంటి అంశాలను కూడా ఆయన చర్చించారు.

ఇక్కడే బీజేపీ చెప్పే మాటలకు, అనుసరించే ద్వందత్వ వైఖరి మీద విమర్శకు అనుమానాలు ఏర్పడుతున్నాయి. బీసీ వర్గానికి చెందిన వ్యక్తి ప్రధానమంత్రిగా ఉన్నాడని చెప్పడం ఒక రాజకీయ వాస్తవం. బీసీలకు తమ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని చెప్పడం మరో రాజకీయ ప్రకటన. కానీ, ఒక రాష్ట్రంలో బీసీలకు 42 శాతం స్థానిక రాజకీయ ప్రాతినిధ్యం కల్పించే ప్రతిపాదన వచ్చినప్పుడు పార్టీ రాష్ట్ర నాయకత్వం దానికి వ్యతిరేకంగా మాట్లాడితే, సహజంగానే “మాటలు వేరు, ఆచరణ వేరు ఎందుకు?” అనే ప్రశ్న వస్తుంది.

అయితే బీజేపీపై విమర్శ చేయడంలో ఒక జాగ్రత్త అవసరం. తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు ప్రకటనను నేరుగా కేంద్ర ప్రభుత్వ తుది నిర్ణయంగా పరిగణించడం రాజకీయంగా తొందరపాటు. కేంద్ర ప్రభుత్వం అధికారికంగా తెలంగాణ 42 శాతం బీసీ రిజర్వేషన్ చట్టాన్ని తొమ్మిదో షెడ్యూలులో చేర్చబోమని తుది నిర్ణయం ప్రకటించినట్లు ఆధారం లేకపోతే, అలాంటి నిర్ణయాన్ని పార్టీ రాష్ట్ర నాయకుడి వ్యాఖ్య ఆధారంగా ఖరారు చేయడం సరికాదు. కానీ అదే సమయంలో రాష్ట్ర అధ్యక్షుడి బహిరంగ అభిప్రాయంపై కేంద్ర నాయకత్వం స్పష్టత ఇవ్వకపోవడం కూడా రాజకీయ సందేహాలకు తావిస్తుంది.

బీజేపీకి ఇప్పుడు ఒక సూటి ప్రశ్న ఎదురవుతోంది. తెలంగాణ కుల సర్వేలో




- డాక్టర్.కోలాహలం రామ్ కిశోర్.
9849328496
ramkishore.1504@gmail.com

వచ్చిన గణాంకాలు సరైనవా? సరైనవైతే వాటి ఆధారంగా బీసీలకు 42 శాతం రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడాన్ని పార్టీ ఎందుకు వ్యతిరేకిస్తోంది? అది రాజ్యాంగపరంగా సాధ్యం కాదని భావిస్తే, అదే లక్ష్యాన్ని సాధించడానికి కేంద్రం ఏ ప్రత్యామ్నాయ రాజ్యాంగ మార్గాన్ని ప్రతిపాదిస్తోంది? ఈ ప్రశ్నలకు స్పష్టమైన, సూటిగా సమాధానం చెప్పకుండా కేవలం "రిజర్వేషన్‌కు 50 శాతం పరిమితి ఉంది" అని చెప్పడం ప్రజా చర్చను అసంపూర్ణంగా ఉంచడమే అవుతుంది.

ఎందుకంటే భారత రాజ్యాంగం మార్పులకు తలుపులు మూసిన పత్రం కాదు. 103వ రాజ్యాంగ సవరణ ద్వారా ఆర్థికంగా బలహీన వర్గాలకు 10 శాతం రిజర్వేషన్‌కు ప్రత్యేక రాజ్యాంగ ప్రాతిపదికను సృష్టించగలిగిన పార్లమెంటు, సామాజికంగా వెనుకబడిన వర్గాల ప్రాతినిధ్య సమస్యకు కూడా రాజ్యాంగబద్ధ పరిష్కారాన్ని రూపొందించగలదు. సుప్రీంకోర్టు 103వ సవరణను కూడా సమర్థించింది. కాబట్టి సమస్య "ఏమీ చేయలేం" అన్నదా, లేక "ఏం చేయాలనే రాజకీయ సంకల్పం ఉందా?" అన్నదా అనేది ప్రజలు అడగాల్సిన ప్రశ్న.

తొమ్మిదో షెడ్యూలు విషయంలో కూడా ఇదే జాగ్రత్త అవసరం. 1951లో తొలి రాజ్యాంగ సవరణ ద్వారా ఏర్పడిన తొమ్మిదో షెడ్యూలు చట్టాలకు రక్షణ కల్పించే సాధనంగా పనిచేసింది. కానీ అది న్యాయవ్యవస్థకు పూర్తిగా అతీతమైన విషయం కాదు. సుప్రీంకోర్టు కేశవానంద భారతి, ఐ.ఆర్. కోయెల్హో వంటి తీర్పుల ద్వారా రాజ్యాంగ మౌలిక నిర్మాణాన్ని దెబ్బతీసే చట్టాలు తొమ్మిదో షెడ్యూలులో ఉన్నప్పటికీ న్యాయ సమీక్షకు లోబడతాయని స్పష్టం చేసింది. కాబట్టి "తొమ్మిదో షెడ్యూలులో పెడితే కోర్టు ఎప్పటికీ ప్రశ్నించలేదు" అనే వాదన న్యాయపరంగా అతిశయోక్తి. కానీ అదే కారణంతో దాన్ని రాజకీయంగా పూర్తిగా నిరాకరించడం కూడా సరైనది కాదు.

తమిళనాడులో 69 శాతం రిజర్వేషన్ల చట్టాన్ని తొమ్మిదో షెడ్యూలులో చేర్చిన ఉదాహరణ ఈ చర్చకు ముఖ్యమైన నేపథ్యం. తెలంగాణ కూడా అదే మార్గాన్ని కోరడం రాజకీయంగా అర్థవంతమే. అయితే తెలంగాణ చట్టానికి న్యాయపరమైన బలం రావాలంటే తొమ్మిదో షెడ్యూలు ఒక్కటే సరిపోదు; సమగ్ర కులాల డేటా, వెనుకబాటుతనానికి ఆధారాలు, తగిన చట్టపరమైన కారణాలు, ప్రాతినిధ్య లోపంపై శాస్త్రీయ విశ్లేషణ, ఇవన్నీ కలిసి ఉండాలి.



ఇక్కడ మరో ముఖ్యమైన అంశం ఉంది. రిజర్వేషన్ అంటే కేవలం పేదరిక నిర్మూలన పథకం కాదు. పేదరికం ఆర్థిక సమస్య. కుల ఆధారిత వెనుకబాటుతనం సామాజిక నిర్మాణానికి సంబంధించిన సమస్య. అందుకే ఆర్థికంగా బలహీన వర్గాలకు ఇచ్చే రిజర్వేషన్‌ను బీసీ రిజర్వేషన్‌తో పూర్తిగా సమానంగా చూడటం సరికాదు. ఒక వర్గం పేదగా ఉండటం, ఒక సామాజిక సమూహం తరతరాలుగా విద్య, వృత్తి, అధికార, సామాజిక గౌరవం వంటి రంగాల్లో వెనుకబడి ఉండటం రెండు వేర్వేరు సమస్యలు.

బీసీ ఉద్యమ నాయకులు చెబుతున్న మరో లోతైన విషయం కూడా విస్మరించరాదు. బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం పెరిగితేనే వారి సమస్యలు పాలనా అజెండాలో శాశ్వతంగా స్థానం సంపాదిస్తాయని వారు భావిస్తున్నారు. మాజీ ఐఏఎస్ చిరంజీవులు బీసీలను "హక్కుల కోసం సంఘటితం కావాల్సిన సమాజం"గా చూస్తున్నారు; ఆర్. కృష్ణయ్య రాజకీయ ప్రాతినిధ్యాన్ని అధికార భాగస్వామ్యానికి పునాదిగా చూస్తున్నారు; జస్టిస్ ఈశ్వరయ్య వంటి న్యాయవేత్తలు ఈ డిమాండ్‌కు రాజ్యాంగపరమైన రక్షణ అవసరాన్ని ముందుకు తెస్తున్నారు; కంచ ఐలయ్య వంటి మేధావులు కుల గణాంకాలను సామాజిక న్యాయ విధానానికి ఆధారంగా ఉపయోగించాల్సిన అవసరాన్ని నొక్కి చెబుతున్నారు. వీరి మధ్య రాజకీయ పద్ధతుల్లో తేడాలు ఉన్నా, ఒక ప్రధాన భావనలో సామ్యం ఉంది. బీసీల సంఖ్యకు తగిన స్థాయిలో నిర్ణయాధికారంలో వారి ప్రాతినిధ్యం ఉండాలి.

అయితే బీసీ ఉద్యమం కూడా తనను తాను ప్రశ్నించుకోవాలి. కేవలం 42 శాతం అనే సంఖ్యను సాధించడం సరిపోతుందా? ఆ 42 శాతం ప్రయోజనాలు బీసీలలోని అత్యంత వెనుకబడిన వర్గాలకు చేరతాయా? స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ వచ్చిన తరువాత కూడా విద్య, నైపుణ్యాలు, ఆర్థిక వనరులు, మార్కెట్ అవకాశాలు, భూమి, చిన్న పరిశ్రమలు, ఉన్నత విద్యలో ప్రాతినిధ్యం పెరగకపోతే రాజకీయ రిజర్వేషన్ ఒక్కటే సామాజిక పరివర్తనను తీసుకురాగలదా? ఇవి కూడా బీసీల ఉద్యమంలో చర్చకు ముందుకు తేవాల్సిన ప్రశ్నలే.

అందుకే తెలంగాణ 42 శాతం బీసీ రిజర్వేషన్‌ను ఒక పార్టీకి వ్యతిరేకంగా మరో పార్టీ చేసే రాజకీయ ఆయుధంగా కాకుండా, భారత సామాజిక న్యాయ విధానానికి ఒక పరీక్షగా చూడాలి. కాంగ్రెస్ ప్రభుత్వం దీనిని ఎన్నికల హామీగా ఇచ్చింది కాబట్టి ఇప్పుడు దానిని న్యాయపరంగా నిలబెట్టే బాధ్యత పూర్తిగా ఆ ప్రభుత్వంపైనే ఉంది. బీజేపీ కేంద్రంలో అధికారంలో ఉంది కాబట్టి రాజ్యాంగపరమైన పరిష్కారానికి మార్గం చూపే బాధ్యత దానిపైన కూడా ఉంది. బీఆర్ఎస్ వంటి ప్రతిపక్షాలకు కూడా కేవలం ప్రభుత్వాన్ని విమర్శించడం కాకుండా, తాము అధికారంలో ఉన్నప్పుడు బీసీలకు ఎంత మేరకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించారో చెప్పాల్సిన బాధ్యత ఉంది.

చివరికి బీసీ సమస్యను ఉచిత బియ్యం, గ్యాస్, పింఛన్లు, ఇతర సంక్షేమ పథకాలతో పరిష్కరించలేం. సంక్షేమం అవసరం. కానీ, సంక్షేమం పౌరుడిని లబ్ధిదారుడిగా ఉంచుతుంది. అధికార భాగస్వామ్యం అతడిని నిర్ణయ కర్తగా మారుస్తుంది. ప్రజాస్వామ్యంలో అసలు సాధికారత అక్కడే మొదలవుతుంది.

తెలంగాణలో 42 శాతం బీసీ రిజర్వేషన్‌పై జరుగుతున్న పోరాటం అందుకే ఒక శాతంపై జరుగుతున్న పోరాటం కాదు. ఇది "జనాభాలో మా వాటా ఎంత?" అనే ప్రశ్నతో మొదలై "రాష్ట్రాధికారంలో మా భాగం ఎంత?" అనే ప్రశ్నకు చేరుకుంది. బీసీలను ఎన్నికల సమయంలో గుర్తుచేసుకుని, అధికారంలోకి వచ్చిన తరువాత మరచిపోయే రాజకీయ సంస్కృతికి ఇది ఒక సవాలు. బీజేపీ సహా ప్రతి రాజకీయ పార్టీ ఇప్పుడు ఒక స్పష్టమైన సమాధానం ఇవ్వాల్సిన సమయం వచ్చింది. బీసీలకు కేవలం ఓటు హక్కు కావాలా, లేక అధికారంలో సముచిత భాగస్వామ్యం కూడా కావాలా?

ఆ ప్రశ్నకు సమాధానం ప్రసంగాల్లో కాదు...చట్టాల్లో, రిజర్వేషన్లలో, రాజకీయ సంస్థల్లో, పాలనా పదవుల్లో, నిర్ణయాధికారంలో కనిపించాలి. అదే నిజమైన సామాజిక న్యాయం.

Printer, Publisher by Palle Ravi Vamshi Mohan on behalf M/s Creative Media Group by Printed at Ramani Web Offset Printers H.No. 8-82/11/1, Autonagar, Bommakal Village, Mdl&Dist: Karimnagar-505001. T.S. Published at H.No. 2-1-14, Saraswathi Nagar, Vidyaranyapuri, Mdl: Hanamkonda, Dist: Warangal-506009. T.S. Editor: Dr PR Vamshimohan.